క్లుప్తంగా

పత్ర కషాయంతో చీడపీడల నివారణ



పత్ర కషాయాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పత్ర కషాయాన్ని ఉపయోగించి పంటలను ఆశించే చీడపీలను సమర్థవంతంగా నిర్మూలించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మిర్తివలసలో బయో ఇన్‌పుట్ సెంటరు వద్ద ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు ఆధ్వర్యంలో పత్ర కషాయం తయారీపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు, గోమూత్రంతో తయారు చేసిన కషాయాన్ని పంటలను ఆశించే పురుగులు, క్రిమికీటకాల నివారణకు వినియోగించవచ్చన్నారు. పత్ర కషాయం కావాల్సిన రైతులు బయోమెట్రిక్ సెంటరులో సంప్రదించాలని సూచించారు.

వేసవిని తలపించేలా..



నిర్మానుష్యంగా ఉన్న ఖడ్గవలస జంక్షన్

పార్వతీపురం: వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. ఎండలకు భయపడి ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ఉక్కబోతతో అల్లాడుతున్నారు. మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రధాన రహదారుల్లో జన సంచారం లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎండల తీవ్రతకు వ్యాపారాలు జరగక చిరువ్యాపారులు నష్టపోతున్నారు.

ఓదార్పుమాత విగ్రహావిష్కరణ



ఓదార్పుమాత విగ్రహం వద్ద గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి ఎస్సీ కాలనీ వద్ద ఓదార్పుమాత విగ్రహాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన కోటిపల్లి విజయలక్ష్మి తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మోహనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అతుకుబడి భూముల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో ఫ్రీహోల్డ్(అతుకుబడి) భూముల రీసర్వేను సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం పరిశీలించారు. ఫ్రీహోల్డ్ రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సాగు వివరాలును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ షేక్ఇబ్రహీం, ఆర్ఐ స్వాతి ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



సీఆర్ఎంటీలు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: మండల విద్యాశాఖ పరిధిలో అమలు జరుగుతున్న విద్యా కార్యక్రమాలను సీఆర్ఎంటీలు పక్కాగా పర్యవేక్షించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం సూచించారు. ఎంఆర్సీలో సీఆర్ఎంటీలు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేరి్పంచాలని, శాఖా పరంగా అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి దానిని కార్యాలయానికి సకాలంలో అందించాలని, స్కూల్ కాంప్లెక్స్ అంశాలను పరిశీలించాలని, బడితోట ప్రతీ పాఠశాలలో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యాలయంలో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండి జిల్లా విద్యాశాఖ కార్యాలయం అడిగిన సమాచారాన్ని వెంటనే వారికి అందించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా అమలు కాని ఎన్నికల హామీలు
- డంపింగ్‌యార్డు, తాగునీటి సమస్యలతో సతమతమవుతున్న పట్టణ వాసులు

పార్వతీపురంటౌన్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయింది. అయినా ఎన్నికల హామీల అమలుకు ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. సూపర్ సిక్స్ హామీలను గాలిలో కలిపేసింది. అభివృద్ధిని పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వస్తే పార్వతీపురం నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను అనతి కాలంలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కనీసం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారంలోకి వస్తే గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తానని, డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇప్పుడు ఆ హామీని చెత్తకుప్పలో పడేశారు. అలాగే పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా



బైపాస్ కాలనీలో చేరిన వర్షపునీరు(ఫైల్)

చేస్తామని చెప్పినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఏటా వర్షాకాలంలో వరహాలగెడ్డ ద్వారా వచ్చిన వరదనీటి ప్రవాహం వల్ల ముంపునకు గురవుతున్న బైపాస్ కాలనీ సమస్యతో పాటు రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు, 30 వార్డుల్లో ఉన్న మురుగునీరు ప్రవహించేందుకు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు రోడ్లపై ప్రవహించే దుస్థితి నెలకొంది. సమస్య పరిష్కారానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణ



పార్వతీపురంలో డంపింగ్ యార్డు



జలమయమైన ఆర్టీసీ బస్టాండ్ (ఫైల్)

ప్రధాన రహదారికి ఇరువైపులా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బైపాస్ రోడ్డు నిర్మించి ట్రాఫిక్‌ను దారి మళ్లించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు. అధికారులు, ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. శరవేంగా విస్తరిస్తున్న పట్టణ శివారుల్లో వెలసిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. పట్టణంలో సారా, గంజాయి వినియోగం పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మంత్రిగారు హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?



తెరుచుకోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ

- కూటమి వందరోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- హామీల అమలుకు పడని అడుగులు
- మంత్రి తొలి సంతకం, ఆదేశాలకు అతీగతి లేదంటూ విమర్శలు



మరమ్మతులను నోచుకోని సామాజిక మరుగుదొడ్లు

సాలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ తెరిపిస్తాం.. దేశంలోనే అతి తక్కువ పన్నులు విధించి లారీ పరిశ్రమను ఆదుకుంటాం.. జీఓ 3 ద్వారా గిరిజనులకు న్యాయం చేస్తాం.. 16 రకాల సంక్షేమ పథకాలను గిరిజనులకు అందిస్తాం.. పెద్దగెడ్డ పనులు పూర్తిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గుమ్మడి సంధ్యారాణి నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో కనీసం ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలు చేయలేదు.

కార్యరూపం దాల్చని తొలి సంతకం

స్త్రీ, శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం చేశారు. ఇంతవరకు నియామకాల దిశగా అడుగులు పడిన దాఖలాలు లేవు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పలువురు విద్యార్థులు అనారోగ్యంతో మరణించినా మంత్రిగా ఉన్న ఆమె కనీసం స్పందించలేదు.

ఆత్మగౌరవం హామీలు అమలయ్యేదెప్పుడు?

పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న సామాజిక మరుగుదొడ్లు పూర్తిగా మూలకు చేరాయి, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, వారి ఆత్మగౌరవం దెబ్బతింటోందంటూ ఎన్నికల ప్రచార సమయంలో మంత్రి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అయ్యాక సామాజిక మరుగుదొడ్లను వారం రోజుల్లో మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వంద రోజులు పాలన పూర్తియినా నేటికీ సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు పూర్తికాలేదు.

యువగళం హామీలు అమలైతే ఒట్టు

యువగళంలో భాగంగా నారా లోకేష్ పట్టణంలో బహిరంగ సభ నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకుంటామని, లారీ పరిశ్రమపై పన్నులు తగ్గిస్తామని, జీఓ 3 అమలు చేసి గిరిజనులకు న్యాయం చేస్తామని, ఐటీడీఏలను బలోపేతం చేస్తామని తదితర హామీలు ఇచ్చారు. ఈ వంద రోజుల పాలనలో వాటిలో ఏ ఒక్క హామీని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో కేవలం పింఛన్ల పెంపు తప్ప మరే ఇతర హామీలు అమలు కాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



నాటుబళ్లతో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

బలిజిపేట: ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ పడలేదు. ఇసుక రీచ్‌ల కేటాయింపు జరగకపోయినా నదీ తీరాల్లో నాన్‌స్టాప్‌గా ఇసుక తోడేస్తున్నారు. యథేచ్ఛగా తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాత్రిపగలు తేడాలేకుండా నాటుబళ్లతో ఇష్టానుసారం తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో గతంలో సువర్ణముఖీ నదీ పరీవాహక ప్రాంతంలో అరసాడ, పదమాయవలస, అజ్జాడ, నారాయణపురం, పి.రావివలసల వద్ద ఇసుకను నాటుబళ్లతో సేకరించేవారు. వేగావతి నదీపరీవాహక ప్రాంతంలో అంపావల్లి, వంతరాం రేవుల వద్ద ఇసుకను నాటుబళ్లతో పట్టుకునేవారు. ఇప్పుడు వాటికి అధికారికంగా అనుమతులు లేవు. కొత్త ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలకు నూతన పాలసీ తీసుకొస్తామని చెపుతున్నా.. ఇంతవరకు విధి విధానాలు ఖరారు కాలేదు.

మండలంలో కొత్త రీచ్‌ల కేటాయింపు జరగలేదు. దీంతో కొంతమంది అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. మరోవైపు గృహ నిర్మాణాలకు ఇసుక లభ్యం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేసి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ జనార్దనరావు వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ ఎవరైనా పట్టుబడితే వారిపై చర్యలు తప్పవన్నారు. త్వరలో ఇసుక రీచ్‌లు కేటాయింపు జరిగే అవకాశాలున్నాయన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

సీతానగరం:

మండలంలోని రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. చినభోగిలి జంక్షన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న పలువురుపై అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఓటీపీ, పిన్ నంబర్లు ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని సూచించారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, వలంటీర్లు

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న

పార్వతీపురంటౌన్: వంద రోజులుగా వలంటీర్లను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ మండిపడ్డారు. వలంటీర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్లతో కలిసి పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లకు న్యాయ చేయాలని కోరుతూ ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న వలంటీర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వచ్చే కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని, సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కాలయాపన చేస్తున్న ప్రభుత్వం..

క్యాబినెట్ సమావేశంలో వలంటీర్ల సమస్యపై నిర్ణయం తీసుకోకుండా స్కిల్ సెన్సస్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు త్వరితగతిన న్యాయం చేయాల్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రాజీనామా చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, రూ.10 వేల గౌరవ వేతనంతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, సింహాచలం, వెంకట్, రామారావు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచింది

- మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రూ.10 వేల కోట్ల అప్పును రాష్ట్రానికి మిగిల్చిందని రాష్ట్ర శిశుసంక్షేమ, గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. మండలం మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజావేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని ఆరోపించారు. అలాగే చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట తప్పే నాయకుడు కాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను అమలు చేస్తారని స్పష్టం చేశారు. ఇప్పటికే పింఛన్లను రూ.4 వేలకు పెంచామని గుర్తుచేశారు. ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని దీపావళికి ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఐటీడీఏ ఉందో లేదో తెలియని పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐటీడీఏల్లో ఐఏఎస్ అధికారులను పీఓలుగా నియమించిందన్నారు. ఐటీడీఏలకు రూ.173 కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



స్వచ్ఛతా హీ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



మక్కువ: కవిరిపల్లిలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పార్వతీపురంటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పట్టణంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

మక్కువ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కవిరిపల్లి గ్రామంలో శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అలమండ సుధ, వైద్యాధికారి అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి సీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అణగదొక్కాలని చూస్తే ఉద్యమిస్తాం..

- పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాచిపెంట: మండలంలో అన్ని పంచాయతీల అభివృద్ధికి సహకరిస్తామని, తమను అణగదొక్కాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక తమను అణగదొక్కే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధిహామీ చట్టాలను ఉల్లంఘించే విధంగా అధికారులు చర్యలకు పాల్పడుతున్నారని, ఫలితంగా తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఉపాధిహామీ నిధులతో పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వాటికి సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ తీర్మానం చేసి మండల పరిషత్‌కు, జెడ్పీకి పంపిస్తారన్నారు. కలెక్టర్‌కు ఆమోదం తరువాత డ్వామా నుంచి ప్రతిపాదనలు పంపిచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో పనులు మంజూరుచేసిన వాటికి ఇప్పుడు పంచాయతీ తీర్మానాలు, మండల తీర్మానాలు ఇవ్వాలని అధికారులు అడగడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గ్రామసభలో తీర్మానాలు పంపిన తరువాత అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు, కానీ పనులు మంజూరు చేసిన తరువాత నేడు తీర్మానాలు చేయాలని అధికారులు సూచించడం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన నిధులు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అయిన సర్పంచ్ ఖాతాలో జమచేయాల్సి ఉందని, అలా కాకుండా ఈ పనులు చేసిన వ్యక్తి ఖాతా లేదా మరెవరి ఖాతాలోనైనా నగదు జమచేస్తే స్థానిక సర్పంచ్‌లను అవమానించడంతో పాటు ఉపాధిహామీ చట్టాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలను రబ్బరు స్టాంపులుగా మార్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తే ప్రజా పోరాటం తప్పదన్నారు. అవసరమైతే న్యాయ పోరాటాలు చేస్తామని పునరుద్ఘాటించారు. అధికారులు చట్టాలకు అనుగుణంగా పాలన చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కొత్రజన్ని సింహాచలం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు, పాచిపెంట వీరంనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ టి.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.